క్లుప్తంగా

మెడికల్ కాలేజీకి మృతుడి భౌతిక కాయం అప్పగింత

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని హనుమోజీపాలెంలో గురువారం మృతి చెందిన బెల్లం శ్రీనివాసరావు మృతదేహాన్ని అతని బంధువులు మెడికల్ కాలేజీకి అప్పగించినట్లు ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ సభ్యులు జెట్టి వెంకటేశ్వర్లు(స్వామి) తెలిపారు. విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కాలేజీ సిబ్బంది శుక్రవారం అతని భౌతిక కాయాన్ని తీసుకెళ్లినట్లు తెలిపారు.

మండల యూటీఎఫ్ అధ్యక్షుడిగా ప్రసాద్


టీ.ప్రసాద్


కే.పోతురాజు

మేదరమెట్ల: కొరిశపాడు మండల యూటీఎఫ్ నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా టీ.ప్రసాద్, కే. పోతురాజులను ఎన్నుకున్నారు. మేదరమెట్ల యూటీఎఫ్ భవనంలో నిర్వహించిన సమావేశంలో నూతన శాఖను ఎన్నుకోవడంతో పాటు పలు తీర్మానాలు, భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకున్నామని సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పీ.హరిబాబు ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించారు. జిల్లా ఆడిట్ కమిటీ మెంబరు బాబురావు, మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేద మహిళకు తోపుడు బండి అందజేత


తోపుడు బండి అందజేస్తున్న రోటరీ సభ్యులు

అద్దంకి: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పేద మహిళకు తోపుడు బండి అందించారు. రోటరీ 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో అందజేశారు. ఈ బండిని చుండూరి రామారావు, వెంకట సుశీల చారిటబుల్ ట్రస్ట్, నాగసూరి ఆంజనేయులు జ్ఞాపకార్థం వారి కుమారుడు సత్యనారాయణ, అత్తులూరి రమేష్‌బాబు, 12వ వార్డు కౌన్సిలర్ సంయుక్త సౌజన్యంతో అందజేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మల్లాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ మొయిన్

జే.పంగులూరు: మండలంలోని పోలీసు స్టేషన్‌ను చీరాల డీఎస్పీ మొయిన్ ఆకస్మిక తనిఖీ చేశారు. శుక్రవారం ఆయన పంగులూరు స్టేషన్‌ను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అలాగే శాంతి, భద్రతలు తలెత్తకుండా సిబ్బంది జాగ్రత్తగా పనిచేయాలని ఆయన సూచించారు. అనంతరం స్టేషన్‌లోని పలు రికార్డులు ఆయన పరిశీలించారు. డీఎస్పీ వెంట సీఐ మల్లికార్జునరావు, ఎస్సై వినోద్ బాబు సిబ్బంది ఉన్నారు.

22 మద్యం సీసాలు స్వాధీనం

పర్చూరు (చినగంజాం): అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉన్న ఇరువురిపై పర్చూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అదుపులోనికి తీసుకున్నారు. శుక్రవారం పర్చూరు మండలం నూతలపాడు, ఇంకొల్లు మండలం వంకాయలపాడు గ్రామాల్లో అనధికారికంగా మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోనికి తీసుకొని వారి వద్ద నుంచి 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ భుజంగరావు తెలిపారు. వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

అమ్మవారికి కార్తీకమాస పొంగళ్లు


అమ్మవారి చెట్టు వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చీరాల: పట్టణంలోని ముత్యాలపేటలోని మహాలక్ష్మమ్మ అమ్మవారి చెట్టు వద్ద శుక్రవారం కార్తీక మాస పొంగళ్లను భక్తులు సమర్పించారు. అమ్మవారి చెట్టు వద్ద కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి చెట్టుకు ప్రత్యేక అలంకరణలు చేశారు. శనివారం సాయంత్రం అమ్మవారి చెట్టు వద్ద లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మహాలక్ష్మమ్మ అమ్మవారి యువజన సంఘం కమిటీ సభ్యులు తెలిపారు.

- అద్దంకిలో దొంగల హల్‌చల్
- వరుస దొంగతనాలతో బెంబేలెత్తుతున్న జనం
- బంగారం, డబ్బే వారి టార్గెట్
- దొంగలను పటుకోవడంలో పోలీసుల దారుణ వైఫల్యం

నిద్రపోతున్న నిఘా.. రెచ్చిపోతున్న దొంగలు !

అద్దంకి రూరల్:

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శాంతి,భద్రతలు కాపాడంలో దారుణంగా విఫలమైంది. కేవలం ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేస్తూ దాడులు చేస్తున్నారు. అంతేకాదు సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టారని సంబంధంలేని కేసులు పెట్టి వేధిస్తోంది. దీనికి వంత పాడుతూ పోలీసులు తానా తందానా అంటున్నారు. అలా కూటమి నాయకులు ఫిర్యాదు చేస్తే ఇలా వెంటనే కేసులు నమోదు చేసుకొనే పనిలో నిమగ్నమయ్యారు. ఫలితంగా ప్రజల శాంతి, భద్రతలను కాపాడటంలో పోలీసులు దారుణంగా విఫలమయ్యారనే వాదన ప్రజల్లో బలంగా వినపడుతోంది. అద్దంకి పట్టణంలో ఈ మధ్య వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇంటికి తాళం వేసి ఎక్కడికైనా వెళ్లడం మాట అటుంచితే, ఇంట్లో వారు ఇంట్లో ఉండగానే దొంగలు ఎంచక్కా నగలు, నగదు దోచుకెళ్తున్నారు. దాంతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. అదే విధంగా పొలాల్లో ఏర్పాటు చేసిన వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను సైతం దొంగలు పగులగొట్టి రాగి, అల్యూమినియం తీగలను అపహరించుకుపోతున్నారు. అయితే ఇదంతా పటిష్ట భద్రత, పోలీసులు తగు చర్యలు తీసుకోకపోవడం వల్లే వరుస దొంగతనాలు జరుగుతున్నాయని ప్రజలు చెప్తున్నారు.


దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై (ఫైల్)

పట్టుకోండి చూద్దాం అంటున్న దొంగలు..

సంవత్సర కాలం నుంచి అద్దంకిలో వరుస దొంగతనాలు జరుగుతుంటే కేసులు రాసుకోవటమే పోలీసులు పనిగా పెట్టుకున్నారు. దొంగలు ఒకే తరహాలో, ఒకే బజారులో వరుసగా నాలుగు, ఐదు దొంగతనాలు చేసి తమను పట్టుకోండి చూద్దాం అని పోలీసులకు సవాల్ విసురుతున్నట్లు ఉంది. పట్టణంలో వరుసగా దొంగతనాలు జరుగుతున్న అద్దంకి పోలీసులు మొక్కుబడిగా రాత్రి వేళల్లో సైరన్ మోగించుకుంటూ గస్తీ తిరుగుతున్నారే తప్ప దొంగతనాలకు ఛేదించటంలో పూర్తి వైఫల్యం చెందారని ప్రజలు భావిస్తున్నారు. దొంగతనం జరిగి సంవత్సరం అయినా ఒక్కరికి కూడా రికవరీ చేసిన ధాఖలాలు లేవు. ఇటుక బట్టీల వద్ద జరిగిన దొంగతనంలో ట్రాక్టర్ దొంగిలించిన దొంగను బాధితుడే కనుక్కొనే దాకా పోలీసులు పట్టుకోలేకపోయారు. తమకు దొంగల భయాన్ని పోగొట్టి భరోసా కల్పించాలని పోలీసులను ప్రజలు వేడుకుంటున్నారు.

వరుస దొంగతనాలు..

గత సంవత్సర కాలం నుంచి అద్దంకి పట్టణంలో దొంగలు స్వైరవిహారం చేస్తున్నారు. ఉద్యోగులు, వ్యాపారులు నివశించే ప్రాంతాల్లోని ఇళ్లను లక్ష్యంగా చేసుకున్న దొంగలు అర్ధరాత్రి వేళలో యజమానులు ఇంటిలో నిద్రిస్తున్న సమయాల్లోనే లోనికి ప్రవేశించి వారి పని ముగించుకుంటున్నారు.

- గత నెలలో ఎన్టీఆర్ కళాశాల వెనుకవైపు ప్రాంతంలో ఒకేసారి నాలుగు ఇళ్లల్లో దొంగలు పడ్డారు. ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో వెనుకవైపు తలుపు తీసి బీరువాలు పగులగొట్టి బంగారం, నగదు దోచుకెళ్తున్నారు. మరీ విడ్డూరంగా ఒక ఇంటి డాబాపైన పార్సిల్ తెచ్చుకుని బిర్యాని తిన్న ఆనవాళ్లు కనిపించాయి. అంటే దొంగ ఎంత నింపాదిగా దొంగతనాలు చేస్తున్నాడో అర్థం చేసుకోవచ్చు.
- ఏడునెలల క్రితం ఒక బ్యాంకు ఉద్యోగి ఇంటిలో దొంగలు పడి అధిక మొత్తంలో బంగారం, నగదు దొంగిలించారు.
- 19వ తేదీ కాకానిపాలెం, విశ్వభారతి పాఠశాల సమీపంలో వరుగా రెండిళ్లలో దొంగలు పడి ఒక్కో ఇంట్లో 20 సవర్ల బంగారం అపహరించారు. ఒక్క ఆరు నెలల వ్యవధిలోనే 20కి పైగా దొంగతనాలు జరిగాయి.

బంగారం, డబ్బులే ప్రధాన టార్గెట్..

అద్దంకిలో ఇటీవల జరిగిన దొంగతనాలు అన్ని పరిశీలిస్తే దొంగలు బంగారాన్ని, డబ్బులే లక్ష్యంగా చేసుకున్నట్లు కనబడుతోంది. దొంగతనం జరిగిన ఇంటిలో ఒక వేళ బంగారం, డబ్బులు లేకపోతే ఏమీ తీసుకెళ్లకుండా వెళ్లిపోతున్నారు. కొన్నిచోట్ల వెండి వస్తువులను కూడా విడిపెట్టి వెళ్తున్నారు. ఇంటిలో కుటుంబ సభ్యులు ఉన్నా లెక్కచేయకుండా చాకచక్యంగా దొంగతనాలకు పాల్పడుతున్నారు.

భయాందోళనలో అద్దంకి ప్రజలు..

ఇలా ప్రతి నాలుగు రోజుల కొకసారి దొంగతనాలు జరుగుతుంటే అద్దంకి ప్రజలు తీవ్రభయాందోళన చెందుతున్నారు. కనీస అవసరాల కోసం అయినా ఇంటిలో నగదు, బంగారం పెట్టాలంటే భయంతో వణికి పోతున్నారు. దొంగలు రెక్కి నిర్వహించి ప్లాన్ ప్రకారం చోరీలకు పాల్పడుతున్నారని ప్రజలు భావిస్తున్నారు. ఉదయం నుంచి ఉద్యోగ, వ్యాపారా రీత్యా ఇతర ప్రాంతాలకు వెళ్లి రాత్రికి ఇంటికి వచ్చి నిద్రపోదామన్నా దొంగల భయంతో నిద్రపట్టటం లేదని ప్రజలు వాపోతున్నారు. భయంతో తమ ఇళ్లను పూర్తి భద్రత ఏర్పాటు చేసుకునేందుకు ఇంటి ప్రాంగణంలో ఖాళీగా ఉన్న ప్రాంతాన్ని ఎవరు రాకుండా ఉండేందుకు ఇనుప మెస్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు.


దొంగతనం ఎలా జరిగిందో పోలీసులకు వివరిస్తున్న ఇంటి యజమాని (ఫైల్)


బీరువాలోని వస్తువులు తీసి మంచం మీద పడేసిన దొంగలు (ఫైల్)


ఓ ఇంట్లో దొంగలు పగులగొట్టిన బీరువా (ఫైల్)

> **పట్టణంలో గస్తీ పెంచాం, రికవరీలు కూడా చేస్తున్నాం..**
> అద్దంకి పట్టణంలో వరుస దొంగతనాలను అరికట్టేందుకు గస్తీ ముమ్మరం చేశాం. స్వయంగా నేనే గస్తీ నిర్వహిస్తున్నాను. పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్ దొంగలను కూడా పట్టుకున్నాం. ఇంట్లో నిద్రపోయే సమయంలో కిటికీలు మూసి ఉంచాలి. వరండాలో, హాల్లో లైట్లు ఆర్పవద్దు. ఇటీవల జరిగిన దొంగతనాలను పరిశీలిస్తే తెరచిన కిటికిలో నుంచి కర్ర సహాయంలో తలుపు గడియ తెరుస్తున్నారు. ఇంటి ముందు లైట్లు ఆర్పటం వల్ల మేం గస్తీకి వచ్చినపుడు ఎవరైనా దాక్కొని ఉన్నా కనబడటం లేదు. మీ బజారులో గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తూ, అనుమానస్పదంగా కనబడితే స్టేషన్‌కు తెలపాలి.
> – కృష్ణయ్య, సీఐ, అద్దంకి

ఔషధ మొక్కలతో అందరికీ ఆరోగ్యం

అద్దంకి: ఔషధ మొక్కలతో అందరూ ఆరోగ్యంగా ఉండవచ్చని ఎంఈవో బీ సుధాకర్ అన్నారు. ఐఈఈఆర్డీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జాతీయ ఔషధ మొక్కల బోర్డు ఆయుష్ మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీ వారి ఆర్థిక సౌజన్యంతో విద్యార్థులకు ఔషధ మొక్కలపై అవగాహన కల్పించారు. శుక్రవారం అద్దంకి ప్రభుత్వ బాలికల, బాలుర జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ ఔషధ మొక్కల అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా వచ్చి మాట్లాడారు. ఐఈఈఆర్డీ సేవా సంస్థ అధ్యక్షుడు బి.కిరణ్ చంద్ మాట్లాడుతూ మన పూర్వీకులు వైద్య విధానంలో ఔషధం మొక్కలు కీలక పాత్రను పోషించాయన్నారు. నేటి సమాజంలో ఔషధ మొక్కల పై ప్రజలకు అవగాహన లేకపోవడం వలన అనారోగ్య పాలవుతున్నారని తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా స్కూళ్లల్లో వేప, తులసి, అలోవెర, అశ్వగంధ, బ్రహ్మ, ఉసిరి, తమలపాకు, ఎర్రచందనం, రణపాల, నల్ల పసుపు, పుదీనా, సన్న ఔషధ మొక్కలు నాటారు. కార్యక్రమంలో కేరళ, లక్నో, హైదరాబాద్, సిమాప్ ఔషధ మొక్కల పరిశోధన కేంద్రం నుంచి తెప్పించిన ప్రత్యేక ఔషధ గుణాల మొక్కలను స్కూల్ విద్యార్థుల చేత నాటించారు. విద్యార్థులకు ఉచితంగా ఔషధ మొక్కలు పంపిణీ చేశారు. ఔషధ మొక్కలపై అవగాహన కలిగిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.


విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ సుధాకర్‌రావు

ఎస్టీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ

చీరాల టౌన్: ప్రతినెల నాలుగో శుక్రవారం ఎస్టీల సమస్యలు, ప్రభుత్వం నుంచి వారికి అందించాల్సిన సేవలపై ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నామని తహశీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో ఎస్టీల కోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. చీరాల మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారితో పాటుగా సంచార జాతులకు చెందిన వారు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలు అర్జీలను తహశీల్దార్‌కు అందించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ చీరాల పట్టణం, మండలంలోని గ్రామ పంచాయతీల్లో ఉన్న ఎస్టీలైన ఎరుకల, యానాదులు, గిరిజనులు, సంచార జాతులకు చెందిన వారికి ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తెలియజేస్తే వాటికి త్వరగా పరిష్కారం చూపుతామన్నారు. ఏళ్ల తరబడి రోడ్లపై గుడారాలు వేసుకుని జీవనం సాగిస్తున్న సంచార జాతులను ఆదుకుని వారికి ఇంటి స్థలాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారని, త్వరగా స్థలాలు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివ సుబ్రమణ్యం, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.


అర్జీలు తీసుకుంటున్న తహశీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీవో శివసుబ్రమణ్యం

గంగపాలెంలో కుంకుమ పూజలు

బల్లికురవ: శివకేశవులకు ప్రీతిపాత్రమైన కార్తీక మాసంలో మహిళలంతా ఆలయానికి వచ్చి సామూహిక కుంకుమ పూజలు చేపట్టటం ఎంతో విశేషమని టీటీడీ, హిందుధర్మ ప్రచార పరిషత్ కోఆర్డినేటర్లు చెన్నుపల్లి నాగేశ్వరరావు, రావినూతల రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని గంగపాలెం గ్రామంలోని పాత రామాలయంలో సౌభాగ్య లక్ష్మీ, కుంకుమ పూజలు చేపట్టారు. గ్రామానికి చెందిన 40 మంది మహిళలు వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయఅర్చకులు ఐవీ శోభనాచార్యులచే గణపతి పూజతో ప్రారంభమై కుంకుమ పూజలతోపాటు హిందు ధర్మంలో చేపట్టాల్సిన పూజల విశిష్టతలను వివరించారు. దాస భారతీయ జానపద కళాక్షేత్రం గౌరవాధ్యక్షుడు ధర్మవరపు శ్రావణ్ కుమార్, మాదాల దానయ్య, వెంకట్రావు, పుట్టా వీరాంజనేయులు, తొట్టెంపూడి కుమారి, చిగురుపాటి శంకరరావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

ఫసల్ బీమాతో పంటలకు రక్ష

పర్చూరు (చినగంజాం): రైతులు పంటల బీమా పథకంలో సత్వరం పంటలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్ రామ్మోహనరెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా పంటల బీమా పథకాన్ని టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ ద్వారా జిల్లాలో అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ బీమా పథకాన్ని 2016లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినట్లు రబీ సీజన్ 2024–25లో రైతులు సాగు చేసిన పంటలకు, సాగు చేయబోయే పంటలకు పంటల బీమా చేసుకోవడానికి నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. రైతులు అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. బీమాకు కావాల్సిన డాక్యుమెంట్‌లు ఆధార్ కార్డు, పొలం పాస్‌బుక్ జిరాక్స్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, రైతు సేవా కేంద్రంలో ఇచ్చే పంట ధ్రువీకరణ పత్రం, రైతు ఫోన్ నంబర్‌లను తీసుకొని దగ్గరలోని వినియోగదారుల సేవా కేంద్రలో బీమా చేయించుకోవాలని తెలిపారు.

ఘనంగా జాతీయ జీడిపప్పు దినోత్సవం


జీడిపప్పు కార్మికులను సన్మానిస్తున్న సంస్థ ప్రతినిధులు

వేటపాలెం: స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో జీడీపప్పు షాపు వద్ద జాతీయ జీడిపప్పు దినోత్సవం వేడుకలు శుక్రవారం నిర్వహించారు. జీడిపప్పు వ్యాపారి ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి ఏడాది నవంబరు 23న జాతీయ జీడిపప్పు దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని చెప్పారు. దేశంలో అధిక ఎగుమతి వస్తువుల్లో జీడిపప్పు ఉందన్నారు. వేటపాలెంలో 146 ఏళ్ల క్రితం జీడిపప్పు పరిశ్రమలు స్థాపించారని తెలిపారు. జీడిపప్పు పరిశ్రమలో యాంత్రీకరణ ఏర్పడటంతో కార్మికుల సంఖ్య తగ్గిందన్నారు. అనంతరం జీడిపప్పు పరిశ్రమలో ఉపాధి పొందిన రావి మస్తాన్‌రెడ్డి, బక్క సీతారమమ్మలను సంస్థ యజమానులు సత్కరించించారు. కార్యక్రమంలో ఉత్పత్తిదారులు చుండూరి నాగాంజనేయులు, రామకృష్ణ, కరణం మురళీకృష్ణ, హరి ప్రసాదరావు, భాస్కర్, రమేషు, అయ్యప్ప, సత్యానందం, రజిని, రోశమ్మ, మున్ని, భవనేశ్వరి పాల్గొన్నారు.

మూడు నెలల పెన్షన్ తీసుకోకుంటే తొలగింపు

చినగంజాం: ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం నవంబరు నెల నుంచి డిసెంబరు 2024 వరకు తీసుకోక పోయినట్లైతే మూడు నెల వరకు ఒకేసారి ఇస్తారని ఎంపీడీఓ ఏ శ్రీనివాసమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు వరుసగా పెన్షన్ తీసుకోకపోతే వారి పెన్షన్ తొలగిస్తామని ఆయన తెలిపారు. ఒక కుటుంబంలో పెన్షన్ తీసుకుంటున్న పెన్షన్‌దారులు మగవారు చనిపోతే వెంటనే పెన్షన్ వారి జీవిత భాగస్వామి అయిన భార్యకు అదే నెలలో మంజూరు చేసి చెల్లించనున్నట్లు ఆయన తెలిపారు.

కార్మికురాలిని విధుల్లోకి తీసుకోవాలని ధర్నా

చీరాల అర్బన్: పాఠశాలలో మధ్యాహ్న భోజన వంట కార్మికురాలిని విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.వసంతరావు అన్నారు. కార్మికురాలిని విధుల్లోకి తీసుకోవాలంటూ శుక్రవారం ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గత 14 సంవత్సరాలుగా కస్తూరిబా గాంధీ బాలికోన్నత పాఠశాలలో పనిచేస్తున్నప్పటికి ఎప్పుడు రాని ఆరోపణలు ఇప్పుడు ఎందుకు వచ్చాయని ప్రశ్నించారు. ఇప్పటివరకు ఆమెపై ఎటువంటి ఆరోపణలు రాలేదని, అధికారులు తొలగించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. ఆమెను విధుల్లోకి తీసుకోకుంటే ఆందోళన చేస్తామన్నారు. అనంతరం ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కాగిత కిషోర్, ఎస్‌కె కాలేషా, ఐవి ప్రసాద్, జి.సుజీవన, విజయలక్ష్మి, ఇంద్రాణి, భార్గవి, కాంతమ్మ, ఎస్.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

పాఠశాలల ప్రగతిపై చర్చలు అవసరం


సమావేశంలో పాల్గొన్న ఎంఈఓ, కాంప్లెక్స్ చైర్మన్‌లు

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల ప్రగతిపై సీఎంసీ సమావేశాల్లో తప్పనిసరిగా చర్చించాలని ఎంఈఓ మొలబంటి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ఎమ్మార్సీలో ఏర్పాటు చేసిన ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 7వ తేదీన నిర్వహించనున్న సమావేశంలో ఆయా పాఠశాలల ప్రగతిలో ప్రతి అంశాన్ని కూలంకుషంగా చర్చించాన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో ఈ సమావేశాలు జరగాలన్నారు. సమావేశంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, వారి సూచనలు, సలహాలను తప్పకుండా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో చైర్మన్‌లు ఎంవీ సుబ్బారావు, ఏ ఉమామహేశ్వరరావు, శేఖర్‌బాబు, ఆంజనేయులు, ప్రభాజీ, పావులూరి శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

రీసర్వేలో తప్పులకు ప్రత్యేక బృందాలు


రీ సర్వేలో సమస్యల పరిష్కారం చేస్తున్న సిబ్బంది

జే.పంగులూరు: మండలంలోని రీ సర్వే జరిగిన గ్రామాల్లో రైతుల సమస్యలు పరిష్కారం దిశగా గ్రామాలకు రెవెన్యూ బృందాలను ఏర్పాటు చేశారని తహశీల్దార్ పీ సింగారావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కోటపాడు గ్రామంలో తలెత్తిన సమస్యలను పరిష్కరించారు. రీ సర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారంలో భాగంగా రెవెన్యూ సిబ్బంది శుక్రవారం ఆయా గ్రామాల్లో పనిచేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

200 మంది స్వాములకు అన్నదానం

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల పాత గుంటూరు రోడ్డులో గల అయ్యప్ప స్వామి దేవస్థానంలో గణపతి మురుగన్ అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదాన వితరణ చేశారు. 34వ రోజైన శుక్రవారం అన్నదాన కార్యక్రమంలో 200 మంది స్వాములకు అన్న సంతర్పణ చేశారు. దైవాలరావూరు గ్రామానికి చెందిన చెన్నుపాటి సుబ్బారావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు దాతలుగా వ్యవహరించినట్లు సేవాసమితి సభ్యులు తెలిపారు.

పతకాలు సాధించిన క్రీడాకారులకు సత్కారం

చీరాల రూరల్: ప్రపంచ స్థాయిలో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులను సత్కరించారు. టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో స్పెషల్ బ్రాంచ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న సీహెచ్. నాగరాజు, ఈపురుపాలేనికి చెందిన అడిగోపుల సాంబశివరావులు పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో నిర్వహించిన ప్రపంచస్థాయి మాస్టర్ అథ్లెట్స్‌లో పాల్గొని బంగారు పతకాలు సాధించిన సందర్భంగా శుక్రవారం స్థానిక ఎన్ఆర్అండ్‌పిఎం హైస్కూలు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులను, కోచ్ పులుగు ధనుంజయ శ్రీనివాసరెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు రామకృష్ణ, చింతా రమేష్, గొడవర్తి సుధాకర్, అమరా వీరాంజనేయులు, గుర్రం బదరీనాథ్, పూర్ణచంద్ర రావు, నారాయణమూర్తి, భాస్కరరావు పాల్గొన్నారు.


నాగరాజు, సాంబశివరావు, శ్రీనివాసరెడ్డిలను సత్కరిస్తున్న వాకర్స్ సభ్యులు